ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 24 ఫిబ్రవరి 2024

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.157 | 228 | 259 |
| సూర్యాపేట | రూ.160 | 230 | 260 |
| నల్లగొండ | రూ.160 | 230 | 260 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 22.0



పాతగుట్ట తిరువీధుల్లో గరుడవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

# గరుడ వాహనంపై "విహారం"

**కొనసాగుతున్న పాతగుట్ట బ్రహ్మోత్సవాలు**



గరుడవాహనంపై స్వామివారు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి23:** పాతగుట్ట లక్ష్మీనరసింహుల దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవ తిరుకల్యాణమూర్తులను శుక్రవారం వెండిగరుడసేవలో భక్తులు దివ్య దర్శనం చేసుకుని తరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో నూతన కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహుడిని లక్ష్మీనాథుడైన శ్రీమహావిష్ణుమూర్తి అలంకారంలో అలంకరించిన అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా శ్రీమహావిష్ణువు అలంకారంలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై అధిష్ఠించి దేవేరి శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సమేతంగా పాతగుట్ట ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగారు. దివ్యాలంకార శోభితులైన లక్ష్మీనృసింహులు వేద స్వరూపుడైన వెండి గరుడవాహనంపై అధిష్ఠించగా వేద పండితులు, పారాయణీకులు వెంట రాగా మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలతో భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఊరేగగా యావత్ భక్తజనులు అలంకారసేవను దర్శించుకున్నారు. దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో అర్చక, రుత్వికబృందం బ్రహ్మోత్సవ వైదిక పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు మల్లాపురం శ్రీరామ భక్తభజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళా భజన మండలి, హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శ్రీదేవి భక్తి సంగీత విభావరులు, మేడ్చల్ జిల్లా రాంపల్లికి చెందిన సాంస్కృతిక విశ్వకళా మండలి కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**నేత్రపర్వంగా లక్ష్మీనృసింహుల దివ్యవిమాన రథోత్సవం**

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో శుక్రవారంరాత్రి కల్యాణ లక్ష్మీనరసింహుడు దివ్య విమానరథంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలు, మామిడి, అరటి తోరణలతో స్వామివారి దివ్య విమానరథాన్ని అలంకరించారు. ప్రధానాలయం ఎదుట అర్చకబృందం విశ్వక్సేనారాధనలతో రథాంగ బలి, దిష్టికుంభ పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు అనంతరం. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో నూతన కల్యాణమూర్తులు లక్ష్మీ, నారసింహులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేకసేవలో తీర్చిదిద్దారు. అలంకార సేవను వేదమంత్ర పఠనాలతో ఊరేగింపుగా ప్రధానాలయం ముందున్న దివ్యవిమాన రథం వద్దకు తీసుకొచ్చారు. వేదమంత్ర పఠనాలతో దివ్యవిమాన రథంపై లక్ష్మీనృసింహుడిని అధిష్ఠింపజేశారు. రథాంగ రూఢుడైన కల్యాణ లక్ష్మీనృసింహుడి దివ్యవిమాన రథాన్ని పాతగుట్ట ఆలయ తిరువీధుల్లో భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఊరేగించారు.



దివ్యవిమాన రథోత్సవం ఊరేగింపు, (ఇన్‌సెట్‌లో) దివ్యవిమాన రథంపై స్వామివారు

**వైభవంగా ఊంజల్ సేవోత్సవం**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో నిత్యపూజలు ఆరంభించిన ఆచార్యులు గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. కొండపైన శివాలయంలో పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరుడికి నిత్యార్చనలు, యాగశాలలో రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.18,50,451 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

## నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

- హాజరవుతున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**యదాద్రిప్లాంట్ పరిశీలన**



**హుజూర్‌నగర్/దామరచర్ల, ఫిబ్రవరి 23:** నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు శనివారం పర్యటించనున్నారు. నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని యాదాద్రిపవర్‌ప్లాంట్‌తో పాటు సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులతో పాటు పవర్ ప్లాంట్‌ను సందర్శనకు స్థానిక ఎమ్మెల్యేకు, సంబంధిత శాఖ అధికారులకు మాత్రమే ప్రవేశం ఉన్నట్లు తెలుస్తోంది.

**పర్యటన ఇలా**

- హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి శనివారం ఉదయం 9 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 9.45గంటలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ల్యాండ్ అవుతారు.
- ప్లాంట్‌ను 9.45గంటల నుంచి 11.15 గంటల వరకు సందర్శిస్తారు.
- 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.47గంటలకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెర్వులోని మైహోం పరిశ్రమలో దిగుతారు.
- మైహోం పరిశ్రమ నుంచి చింతలపాలెం మండలం నక్కగూడెం చేరుకుంటారు. 12 గంటల నుంచి 12.45 గంటల వరకు నక్కగూడెం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 12.47కు దొండపాడుకు బయలుదేరుతారు.
- ఒంటి గంటకు చేరుకుని రూ.400 కోట్లతో నిర్మిస్తున్న ఇన్నోవేరా ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు.
- రెండు గంటల నుంచి 2.30 గంటల వరకు జువారీ పరిశ్రమలో భోజనం చేసి 2.30 గంటలకు మైహోం కు బయలుదేరుతారు.
- 2.45కు మైహోంకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 3.30కి బేగంపేటకు చేరుకోనున్నారు.

# 27 నుంచి గృహజ్యోతి వెలుగులు




రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు గ్యారెంటీల అమలుకు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకంలో సేవలు అమలు చేస్తున్నారు. అదేవిధంగా గృహజ్యోతి కింద గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఈ నెల 27న లాంఛనంగా ప్రారంభించనున్నారు. గృహజ్యోతిని కింద 200 యూనిట్ల వరకు మార్చిలో అర్హులకు జీరో బిల్లు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించే ప్రక్రియ ముగిసింది.

- నల్లగొండ/నల్లగొండ టౌన్/ మిర్యాలగూడ అర్బన్

- మార్చిలో అర్హులకు జీరో బిల్లు వచ్చేలా ఏర్పాట్లు
- ఆన్‌లైన్ నమోదు ముగించడంతో ఆందోళనకు గురవుతున్న అర్హులు

గృహజ్యోతి పథకం సంబంధించి వినియోగదారుల విద్యుత్ సర్వీస్ నెంబర్‌తో ఆహార భద్రత కార్డు, ఆధార్‌కార్డు మొబైల్ నెంబర్‌ను అనుసంధానం చేసి, ఈ వివరాలను విద్యుత్ అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు గురువారంతో అప్‌లోడ్ ప్రక్రియను ముగించారు. దీంతో అర్హులైన వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు.

**రేషన్‌కార్డు ఆధారంగానే లబ్ధిదారుల గుర్తింపు**

రేషన్‌కార్డు కలిగిన గృహ విద్యుత్ వినియోగదారులు ఈ పథకానికి అర్హులు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 200యూనిట్లు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనుంది. నల్లగొండ జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో మొత్తం 3 లక్షల కుటుంబాలుండగా 4 లక్షలకుపైగా గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఈ పథకం ఇంటి యజమానులతో పాటు కిరాయిదారులకు కూడా వర్తింస్తుందని ఇటీవల ఆ శాఖ ఉన్నతాధికారుల స్పష్టం చేస్తూ అద్దెకున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చంటూ ప్రకటించారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను విద్యుత్ సంస్థ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసింది. విద్యుత్‌మీటర్ యూఎస్‌సీ(యూనిఫైడ్ సర్వీస్ కనెక్షన్) నెంబర్ నమోదు చేయగానే యాప్‌లో ఇంటి యజమాని వివరాలు కనిపిస్తున్నాయి. ఇంట్లో కిరాయిదారులు ఉంటే వారి వివరాలు నమోదుచేశారు. అయితే రేషన్ కార్డులో ఎంతమంది ఉన్నా ఒక మీటర్‌కే ఉచిత విద్యుత్ వర్తిస్తుందని చెబుతున్నారు. ఒక ఇంట్లో ముగ్గురు ఉన్నట్లయితే వారికి విడివిడిగా రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హులవుతారని అధికారులు స్పష్టం చేశారు. ఇక రేషన్‌కార్డులు లేని వారు పథకానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం వేలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఉచిత విద్యుత్ పథకానికి తెల్లరేషన్‌కార్డు నిబంధన విధించడంతో చాలామంది పేద, మధ్యతరగతి వారికి కార్డు లేకపోవడం కారణంగా ఈ పథకానికి దూరమయ్యే పరిస్థితి. ఫలితంగా అర్హులైన వారు నష్టపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అర్హులైన పేదలు కోరుతున్నారు.

**గృహవిద్యుత్ కనెక్షన్లు 9.89 లక్షలకు పైగానే..**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 9,89,201 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 4,12,424, సూర్యాపేటలో 3,16,350, యాదాద్రిభువనగిరి జిల్లాలో 2,60,427 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహజ్యోతి పథకం కింద అర్హులైన 8.69లక్షల కుటుంబాలు తమ వివరాలను విద్యుత్‌శాఖ అధికారులకు అందజేశారు. ఉదాహరణకు నల్లగొండ జిల్లాను పరిశీలిస్తే మొత్తం 7,66,000 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 2.17 లక్షల వ్యవసాయ వినియోగదారులుండగా 4,12,424 గృహవిద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే కనెక్షన్ల సంఖ్య 3,95,513 సర్వీసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సంబంధించిన ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. అయితే కేవలం 61.8శాతం అంటే 2,52,742 విద్యుత్‌కనెక్షన్ల వివరాలు మాత్రమే సేకరించారు.

**వివరాల నమోదు ప్రక్రియ ముగిసింది**



గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి గృహ వినియోగదారుల వివరాల సేకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. గ్రామీణప్రాంతాలలో 90శాతం వివరాలు సేకరించాం. పట్టణాల్లో మాత్రం మినియోగదారులు అందుబాటులో లేకపోవడంతో కొంతమేరకు మాత్రమే సేకరించాం. మిగతా వివరాలను ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం సేకరిస్తాం. వచ్చిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేశాం.

- టీఆర్ చంద్రమోహన్, ఎస్ఈ నల్లగొండ

**కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలి**



అర్హులైన కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో చర్యలు చేపట్టాలి. పదేళ్లుగా రేషన్‌కార్డు అందకపోవడంతో ఉచిత వైద్యం, ప్రభుత్వ సంక్షేమపథకాలకు అర్హత కలిగిన ఎన్నో కుటుంబాలు దూరమయ్యాయి. కుటుంబాల సంఖ్యపెరుగుతున్న స్థాయిలో ఆహారభద్రతకార్డులు జారీ కాలేదు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారంతా ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన వైద్యాన్ని ఉచితంగా పొందలేక ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఈ సమస్యకు కొత్త సర్కారు పరిష్కారం చూపాలి.

- జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు

## ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి కిరణ్

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 23 :** ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల ఖర్చులు, పర్యవేక్షణ నోడల్ అధికారి కిరణ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ వ్యయ పరిశీలకులకుల బృందాలు, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సభ్యులకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అభ్యర్థుల వ్యయాన్ని ఎలా లెక్క కట్టాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో అధికమొత్తంలో నగదు దొరికితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ, ఇన్‌కం టాక్స్, కమర్షియల్ టాక్స్ కోఆపరేటివ్, లీడ్ బ్యాంక్, ఎక్సైజ్, ట్రాన్స్‌కో, పోలీస్, కోఆపరేటివ్, ట్రెజరీ, ప్లానింగ్ అధికారులతో కలిపి పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీఎస్‌టీ తదితర కమిటీలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్‌కుమార్, ఎన్ఐసీ అధికారి గణపతిరావు, ఎంసీఎంసీ సభ్యులు శేషాచార్యులు, మాస్టర్ ట్రైనర్ తరాల పరమేష్ పాల్గొన్నారు.

## సాగు రంగానికి 24 గంటల విద్యుత్:ఎస్ఈ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఈ

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 23 :** జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవంతరాలు తలెత్తకుండా వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం విద్యుత్ విశ్రాంతిభవనలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో వేసవిలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు కొత్తగా రూ.15 కోట్లతో ఏడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా భవిష్యత్‌లో ఓవర్‌లోడ్ సమస్య పరిష్కారం కాబోతుందన్నారు. వేసవిలో గృహవిద్యుత్ వినియోగదారులకు కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఫ్యూజ్ ఆఫ్ కాల్(ఎఫ్ఓసీ) ఫోన్ నెంబరు 9440814326లో ఫిర్యాదు చేయాలన్నారు. గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని ఇప్పటికే లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేశామన్నారు. సమావేశంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

- కలెక్టర్ హరిచందన




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 23:** జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ దాసరి హరిచందన కోరారు. చిన్నారులు పోలియో వ్యాధి బారిన పడకుండా చూడాలన్నారు. మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ట్రాస్కఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 3న ఎవరైనా చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకోకపోతే వారికి 4, 5 తేదీల్లో వారి ఇంటికి వెళ్లి పోలియో బృందాలు చుక్కలు వేస్తాయన్నారు. జిల్లాలో సుమారు 1,54,895 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వీరికోసం 1,070 కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని, అలాగే 4,280 పల్స్‌పోలియో బృందాలను, 107మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జమీర్, సర్వే లెన్స్ మెడికల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి**

జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలనుఉ సాధించేందుకు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. విద్యార్థులు పరీక్షల లక్ష్యంతో పాటు, జీవిత లక్ష్యాలను పెట్టుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహంతో పాటు గట్టుప్పల, మర్రిగూడెం, అయిటిపాముల గిరిజన బాలుర వసతిగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్ఫూర్తి నింపుతూ ప్రతి విద్యార్థి తన బలాన్ని, బలహీనతలను విశ్లేషించుకో వాలన్నారు. ఆమె వెంట హౌసింగ్ పీడీ, ఇన్ చార్జి డిటీడబ్ల్యూ రాజ్‌కుమార్, ఏటీడబ్ల్యూవో లక్ష్మారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి రామకృష్ణ, ప్రిన్సిపాల్ హనుమాక్షి ఉన్నారు.

**పది పరీక్షల్లో పాతబార్‌కోడ్ విధానం**

**నల్లగొండ:** పదో తరగతి పరీక్షల్లో పాత బార్‌కోడ్ పద్ధతిని అవలంభించాలని డీఈవో భిక్షపతి అన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని సెయింట్ అల్ఫోన్సెస్ హైస్కూల్‌లో అధికారులు, ఉద్యోగులకు ఓరియేంటేషన్, శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

**మెడికల్ కళాశాలపై సమీక్ష**

మెడికల్ కళాశాలను శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించి ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు సంబంధించి అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, సూపరింటెండెంట్ నిత్యానంద పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టుపై పనులను ఆపవద్దు

- సకాలంలో పూర్తి చేయాలి
- కేఆర్ఎంబీ ఎస్ఈ వరలక్ష్మి

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 23:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై అసంపూర్తిగా ఉన్న నిర్వహణ పనులను ఆపవద్దని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఎస్ఈ వరలక్ష్మి అన్నారు. సాగర్ ప్రాజెక్టుపై ప్రతి సంవత్సరం నిర్వహించే నిర్వహణ పనులపై ఏపీ రాష్ట్రం అభ్యంతరం తెలపడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె రెండు రోజుల పాటు ప్రాజెక్టు పనులను పరిశీలించారు. మొదటిరోజైన గురువారం ప్రాజెక్టుపై అసంపూర్తిగా ఉన్న క్రేన్ ట్రాక్, కుడికాల్వ గేట్లపై రోడ్డు నిర్మాణం, సూట్ గేట్లపై రోడ్డు నిర్మాణ పనులను, గ్యాలరీలను, క్రస్ట్ గేట్లకు చేపట్టే గ్రీసింగ్, రబ్బరు సీళ్ల చెకింగ్ వంటి పనులతో పాటు ఇటీవల రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టిన స్పిల్‌వే మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు ఏ మేరకు పూర్తయ్యాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండో రోజు శుక్రవారం హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహంలో ఉదయం ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఈఈ మల్లికార్జునరావు విలేకరులకు తెలిపారు. వానాకాలం ప్రారంభానికి మరో మూడు నెలల గడువు మాత్రమే ఉందని, ఈ మూడు నెలలలోపు ప్రాజెక్టుపై పనులను పూర్తి చేయాలని సాగర్ ప్రాజెక్టుపై పనిచేస్తున్న తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకుంటే ఎగువనుంచి ఒక్కసారిగా వరద వస్తే ప్రాజెక్టుపై భారం పడుతుందని, పనుల్లో వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారని వివరించారు. సమీక్షలో కేఆర్ఎంబీ ఈఈ శివశంకర్, తెలంగాణ నీటి పారుదలశాఖ ఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లిఖార్జున్‌రావు, ఏపీ నీటిపారుదల శాఖ ఎస్ఈ వరలక్ష్మి, ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్‌రావు, జేఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# భూమి రిజిస్ట్రేషన్ ఆపాలని మహిళా రైతు ఆందోళన

**పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యాయత్నం**

**గుండాల, ఫిబ్రవరి 23:** భూమి రిజిస్ట్రేషన్ ఆపాలని ఓ మహిళా రైతు పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్మజాల గ్రామానికి చెందిన సంగి సుమలత తన ఆడపడుచు కొమ్మాయిపల్లికి చెందిన సోమక్క తనకు రావాల్సిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. కొమ్మాయిపల్లిలో ఉన్న 4.08ఎకరాల భూమిని తన ఆడపడుచు సోమక్క అక్రమంగా వేరే వ్యక్తులకు విక్రయించి రిజిస్టేషన్‌కు స్లాట్ బుక్ చేసిన విషయాన్ని తెలుసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినట్లు సుమలత తెలిపింది. భూమి రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసి చేసి తమకు న్యాయం చేయాలని కోరింది. విషయం గమనించిన తహసీల్దార్ జలకుమారి కార్యాలయం నుంచి వెంటనే బయటికి వచ్చి సుమలతతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భూమి వివాదంలో ఉన్నందున రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న మహిళా రైతు సుమలత

## 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23:** నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని లారీ ఓనర్స్ అసోయేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన 22క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎన్. అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లారీ ఓనర్స్ అసోయేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో వేణు అనే వ్యాపారి అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వచేసి ఉంచాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి సోదా చేయగా 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయి. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రేషన్ బియ్యం నిల్వ చేసిన సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# భక్త జన హోరు..



తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు



తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు



మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం





మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

**ప్రముఖుల తాకిడి**

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

**నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర**

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

## సాగర్ జనావాసాల్లోకి జింక

● శ్రమించి పట్టుకున్న అటవీ శాఖ అధికారులు



ఫైలాన్‌కాలనీలో ఓ ఇంట్లో జింకను బంధించిన అటవీశాఖ అధికారులు

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 23:** అసలే వేసవి కాలం.. ఆ పై కొత్త ప్రదేశం.. తినడానికి తిండి, తాగడానికి నీరు దొరకకపోవడంతో అడవిలో ఉండాల్సిన వన్య ప్రాణులు అరణ్యాన్ని వదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. జనావాసాల్లోకి వచ్చిన వన్యప్రాణులు వీధి కుక్కల దాడిలో హతమవుతున్నాయి. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద ఉన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ శాఖ 150 ఎకరాల్లో అర్బన్ పార్క్ ఏర్పాటు చేసింది. పర్యాటకుల సౌకర్యార్థం గత నెల 26వ తేదీన ఆ పార్కులో సఫారీ ట్రిప్పును కూడా ప్రారంభించారు. ఆ పార్కులో పర్యాటకులు చూడడానికి వన్యప్రాణులు లేకపోవడంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారనే ఉద్దేశంతో అటవి శాఖ అధికారులు హైదరాబాద్ జూ పార్కు నుంచి 18జింకలను తీసుకొచ్చి అర్బన్ పార్కులో వదిలారు. జూ పార్కులో పచ్చటి గడ్డిని తింటూ, నిర్వాహకులు ఏర్పాటు చేసే నీటిని తాగుతూ హాయిగా ఉండే జింకలు మచ్చుకైనా పచ్చగడ్డి కానరాని అడవిలో వదలడంతో మేత కోసం, నీటి కోసం జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇలా వచ్చిన రెండు జింకలు 15 రోజుల వ్యవధిలో కుక్కల దాడిలో మృతిచెందాయి. తాజాగా శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో సాగర్ ఫైలాన్‌కాలనీలో ప్రధాన రహదారిపైకి ఓ జింక వచ్చింది. అలా వచ్చిన ఆ జింక జనాలను చూసి, వాహనాల శబ్దాలకు బెదిరిపోయింది. గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారుకలు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అటవీ శాఖ అధికారులు జింకను పట్టుకునేందుకు నానా తంటాలు పడ్డారు. జింక గాంధీ బజారులో ఓ ఇంట్లోకి చొరబడింది. దీంతో కష్టపడి అధికారులు స్థానికుల సహాయంతో దానిని బంధించారు. పరుగెత్తే క్రమంలో మూతి వద్ద గాయం కావడంతో అధికారులు స్థానిక వెటర్నరీ ఆసుపత్రికి జింకను తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఆ జింకను తిరిగి అర్బన్ పార్కులో వదిలారు. జింకను పట్టుకున్న వారిలో ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో రాఘవేంద్రరావు, ఎఫ్ఎస్‌వో రమేష్, బీట్ ఆఫీసర్‌లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

## గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు..



సిలిండర్ నుంచి వస్తున్న నీళ్లు

**చిట్యాలరూరల్, ఫిబ్రవరి 23:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని ఓ గ్యాస్ వినియోగదారురాలికి సిలిండర్‌లో నీళ్లు వచ్చాయి. గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మి వంట చేసేందుకు శుక్రవారం గ్యాస్ స్టవ్ వెలిగించగా మంట మండుతూ సిలిండర్ మంట ఆగిపోయింది. సిలిండర్‌ను పరిశీలించగా బరువుగా ఉన్నా కూడా మంట రాకపోవడంతో పిన్నును నొక్కి పరిశీలిస్తుండగా గ్యాస్‌కు బదులు నీళ్లు రావడంతో అవాక్కయ్యారు. చిట్యాలలోని శ్రీబాలాజి గ్యాస్ ఏజెన్సీకి చెందిన సిబ్బందికి గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్‌కు బదులు నీళ్లు వస్తున్నాయని చెప్పగా వారు మొదట్లో మిన్నుకుండి పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో సిబ్బంది మరో సిలిండర్‌ను అందజేశారని తెలిపారు.

## బాలికను తీసుకెళ్లిన యువకుడి రిమాండ్

**వలిగొండ, ఫిబ్రవరి 23:** మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్రూరు గ్రామానికి చెందిన బండారి రాజు వృత్తిరీత్యా కూలీ. ఫిబ్రవరి 16న సిద్దిపేటకు చెందిన ఒక యాచక కుటుంబం అర్రూరుకు వచ్చింది. ఆ గ్రామ పాత గ్రామ పంచాయతీ వద్ద తాత్కాలికంగా నివాసముంటోంది. ఆ కుటుంబంలో ముగ్గురు బాలికలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆ యాచక కుటుంబంలోని ఓ మైనర్ బాలికను ఫిబ్రవరి 18న రాజు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లాడు. బాలిక కన్పించకపోవడంతో బాధితురాలి తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజుపై ఫోక్సో కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కాగా తప్పించుకు తిరుగుతున్న రాజును జనగామ జిల్లా వద్ద అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## 26న ఎంజీయులో మెగా జాబ్‌మేళా

**నల్లగొండ, ఫిబ్రవరి 23:** తెలంగాణ ఫెసిలిటి మేనేజ్‌మెంట్ కౌన్సిల్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్, ఎంజీయూ సంయుక్తంగా ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈనెల 26వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాను బహుళ జాతి కంపెనీలు అయిన అమెజాన్, జీవీకే, అరవిందో ఫార్మా కంపెనీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ నియామకం**

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం కామర్స్, బిజినెస్ మెనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మారం వెంకటరమణరెడ్డిని నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియమించిన యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య గోపాల్‌రెడ్డితో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం

**గుండాల, ఫిబ్రవరి 23:** తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన దాస సోమయ్య ఇంట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దాస సోమయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మల జాతరకు వెళ్లి శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకునే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఉండడంతో పాటు ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తీసి ఉండడం గమనించారు. బీరువాలో ఉన్న రూ.40వేలు, తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

# హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వాన్ని నిప్పులపై నిలబెడతాం

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



చండూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

**చండూరు, ఫిబ్రవరి 23:** పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 12 సీట్లు గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధికి మోదీనే గ్యారెంటీ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా నల్లగొండ జిల్లా చండూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, హామీలను అమలుచేయకపోతే, పార్లమెంట్ ఎన్నికల అనంతరం నిప్పుల మీద నిలబెడతామని విమర్శించారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాలనలో మునుగోడు నియోజకవర్గం పూర్తిగా వెనకబడిపోయిందని ఆరోపించారు. జిల్లాలో కోమటిరెడ్డి బ్రదర్స్ అభివృద్ధిని గాలికి వదిలేసి రాజకీయ గుత్తాధిపత్యం కోసం ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు.

**బీజేపీని ఖతం చేస్తామంటావా.. ఖబర్దార్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

బీజేపీని ఖతం చేస్తామంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, అలాంటి మాటలు మాట్లాడిన వారు ఇప్పటికే రాజకీయాల్లో కనుమరుగయ్యారని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఖబర్దార్ వెంకట్‌రెడ్డి.. మరోమారు ఇలా మాట్లాడితే తమ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టి, వాటిని పూర్తిచేసి అభివృద్ధి చేయాలన్నారు. పదేళ్లుగా రిజర్వాయర్లను పూర్తిచేయటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 80రోజులవుతున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోయిందన్నారు. పట్టణంలో చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు దూడల బిక్షం, నాయకులు కాసాల జనార్దన్‌రెడ్డి, నకిరేకంటి లింగస్వామిగౌడ్, కోమటి వీరేశం, సోమ నర్సింహ పాల్గొన్నారు.

**బీజేపీతోనే దేశంలో సుస్థిర ప్రభుత్వం**

**మర్రిగూడ:** బీజేపీతోనే దేశంలో సుస్థిర ప్రభుత్వం సాధ్యమవుతుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మర్రిగూడలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు రెండు నెలలు కావొస్తున్నా అమలు చేయలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చర్లగూడ రిజర్వాయర్ పనులు రెండు సంవత్సరాల్లో పూర్తిచేసి మునుగోడు రైతాంగానికి, ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైయ్యారన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహరెడ్డి మాట్లాడుతూ భువనగిరి ఎంపీని గెలిపించినట్లయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, ఏరెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాజేందర్‌నాయక్, గోపాల్, గ్యార గిరి, రామిడి వెంకట్‌రెడ్డి, లాల్‌నాయక్ ఉన్నారు.

**మిర్యాలగూడ టౌన్:** పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి చరిత్ర తిరగరాస్తామని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాదినేని శ్రీనివాసరావు, రతన్‌సింగ్‌నాయక్, సాంబయ్య, రమేష్, పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, మదన్‌మోహన్, హన్మంతరెడ్డి, సరిత ఉన్నారు.

# నేతల చూపు మార్కెట్ పదవుల వైపు

● చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు ● ఎమ్మెల్యేల చుట్టు తిరుగుతున్న నాయకులు



మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

**మోత్కూరు, ఫిబ్రవరి 23:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల నియామకం చేపట్టవచ్చన్న ఊహాగానాలతో మార్కెట్ పదవులు దక్కించుకోవడానికి నాయకులు పావులు కదుపుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 21 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. గత డిసెంబరులో బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయే నాటికి పలుపాలక వర్గాల పదవీకాలం ముగిసి ఖాళీగా ఉండగా, పదవీ కాలం ముగియని పాలక వర్గాలను నూతన ప్రభుత్వం రద్దు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కెట్లలో ఓసీ జనరల్‌కు ఐదు, బీసీ జనరల్‌కు నాలుగు, ఓసీ మహిళలకు ఏడు, బీసీ మహిళలకు రెండు, ఎస్సీ మహిళలకు రెండు, ఎస్టీ జనరల్ ఒకటి రిజర్వు అయ్యాయంటున్నారు.

**స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు**

మొదట్లో నూతన ప్రభుత్వ మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు మార్పుతుందేమోనని భావించారు. గత ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఏ మార్కెట్ ఏ వర్గానికి రిజర్వ్ చేస్తారని ఆయా మార్కెట్ల కార్యదర్శులు ఇటీవల ఆయా మార్కెట్ల పరిధిలోని ఎమ్మెల్యేల దృష్టి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో పాత రిజర్వేషన్లే కొనసాగుతాయని తేలిపోవడంతో కాంగ్రెస్ స్థానిక నేతలు మార్కెట్ చైర్మన్ పదవుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు మార్కెట్ బీసీ(బీ)కి, తిరుమలగిరి మార్కెట్ ఓసీ మహిళ, తుంగతుర్తి మార్కెట్ ఓసీ జనరల్, శాలిగౌరారం మార్కెట్ ఓసీ జనరల్‌కు రిజర్వ్ అయినట్టు ఆయా మార్కెట్ల కార్యదర్శులు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

**మోత్కూరు మార్కెట్ చైర్మన్ కోసం ముమ్మర యత్నాలు**

మోత్కూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలు ఉన్నాయి. మార్కెట్ తుంగతుర్తి, ఆలేరు ఎమ్మెల్యేల పరిధిలో ఉంది. ఇద్దరు ఎమ్మెల్యేలు అవగాహనకు వచ్చి ఒకసారి ఒక ఎమ్మెల్యే, మరోసారి మరో ఎమ్మెల్యే వంతుల వారీగా తమ అనుచరులను నియమించుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రిజర్వేషన్లు ఖరారు అయిననాటి నుంచి ఆత్మకూరు, మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు మార్కెట్ చైర్మన్ పదవి దక్కింది. గుండాలకు అవకాశం రాలేదు, ఈ మార్కెట్ బీసీ(బీ)మహిళకు రిజర్వు కావడంతో ఈ నాలుగు మండలాల కాంగ్రెస్ నాయకులు తమ సతీమణుల కోసం ఎమ్మెల్యేల వద్ద ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

**హుజూర్‌నగర్‌లో సమన్వయ కమిటీ**

**హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల నియామకానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందు కోసం తొమ్మిది మంది ముఖ్య నేతలను ప్రకటించారు. ఈనెల 23న పట్టణంలోని ఇందిర భవన్‌లో నేతలంతా కూర్చొని కమిటీ ఏర్పాటు చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. వారం రోజుల క్రితం హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అనేకమంది ఆశిస్తుండగా ఉత్తమ్‌ను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల ఎంపిక వ్యవహారం స్థానికులకు అప్పగించారు. మార్కెట్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటాయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రెండుసార్లు ఎస్సీ మహిళకు, రెండుసార్లు పురుషులకు, ఒకసారి బీసీ మహిళకు రిజర్వ్ అయింది.

**తిరుమలగిరి మార్కెట్ కమిటీపై ఊహాగానాలు**

**తిరుమలగిరి:** తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో తుంగతుర్తి నియోజకవర్గస్థాయిగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని రెండుగా విభజించారు. తుంగతుర్తి, మద్దిరాల, నూతన్‌కల్ మూడు మండలాలతో తుంగతుర్తిలో మార్కెట్, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మూడు మండలాలతో తిరుమలగిరిలో కార్యకలాపాలు నడుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొద్దిరోజులకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న మార్కెట్ కమిటీలను రద్దుచేసింది. ఇటీవల కాలంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. తిరుమలగిరి మార్కెట్ కమిగా రిజర్వేషన్ ఓసి(మహిళ)గా కేటాయించారు. రిజర్వేషన్ ప్రకటించినప్పటి నుంచి ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే, మంత్రులను తరచూ కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. జాజిరెడ్డిగూడెం వాసికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కనుందని ప్రచారం జరుగుతోంది.

## అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళల విచారణ

**యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 23:** యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని దాతరుపల్లి గ్రామంలో శుక్రవారం ఐదుగురు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్థులు అడ్డగించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా వారు తక్కువ మొత్తంలో అప్పులు ఇచ్చి అధిక వడ్డీలకు ఇచ్చి తిరిగి డబ్బులు వసూలు చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని సీఐ రమేష్ తెలిపారు. గజ్వేల్‌కు చెందిన కండెల జ్యోతి, జగన్నాథం నాగమ్మ, పోలే యశోద, జగన్నాథం జ్యోతి, నాగమ్మలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 109 సీపీఆర్‌సీ సెక్షన్ కింద బైండోవర్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## గంజాయి విక్రయించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

**రామగిరి, ఫిబ్రవరి 23:** గంజాయి విక్రయించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ సెషన్ కోర్టు న్యాయమూర్తి బి. తిరుపతి శుక్రవారం తీర్పునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దపూడి గ్రామానికి చెందిన నందం సురేష్ విశాఖపట్టణంలో కేజీ కేజీ గంజాయిని రూ.2500 కొనుగోలు చేసి నల్లగొండ పట్టణంలో రూ.10వేలకు విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల శివశంకర్ పెట్రోల్ బంక్ సమీపంలో 2022 ఏప్రిల్ 21వ తేదీ సాయంత్రం 6:30 సమయంలో గంజాయి విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న అప్పటి ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు వ్యక్తిపై దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 1.905 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపిచారు. కేసు విచారణ శుక్రవారం ముగియడంతో సెషన్ కోర్టు జడ్జీ తిరుపతి తుది తీర్పును ఇచ్చారు. కాగా ఈ దాడులో స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌వో రోజా సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

**మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 23:** అనుమానాస్పదస్థితిలో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌లో శుక్రవారం జరిగింది. వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... దామరచర్ల మండలం మంగళదుబ్బతండాకు చెందిన కొర్ర ధనలక్ష్మి(29) కొంతకాలంగా తన భర్తకు దూరంగా ఉంటూ సొంత అక్క, బావ ఇంట్లో తన తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి ఉంటోంది. ఇటీవల ధనలక్ష్మి అక్క, బావ విదేశాలకు వెళ్లగా పిల్లలను చూసుకుంటూ వారి ఇంట్లోనే ఉంటోంది. కాగా శుక్రవారం తన కుమారుడితోపాటు, అక్క పిల్లలను స్కూల్‌కు పంపించిన తర్వాత ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ధనలక్ష్మి తమ్ముడు ధీరావత్ దామోదర్ అనుమానం వ్యక్తం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తన అక్క ధనలక్ష్మి మృతికి దామరచర్ల మండలం మోదుగులతండాకు చెందిన మహేష్ అనే వ్యక్తిని అనుమానిస్తూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. మహిళకు మృతికి దారితీసిన కారణాలను తెలుసుకునేందుకు లోతైనవిచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

# పీహెచ్‌సీల నిధులు పక్కదారి?

● ఉప వైద్యాధికారి నిర్వాకం? ● ఇన్‌చార్జి డాక్టర్లు పనిచేసే పీహెచ్‌సీలపై పర్యవేక్షణ ● ఆరేళ్లుగా ఇక్కడే తిష్టవేసిన అధికారి

**మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 23:** ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు మంజూరయ్యే నిధులు స్వాహా అవుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. మిర్యాలగూడ డివిజన్‌లోని పలు ఆస్పత్రులకు ప్రభుత్వం ఇచ్చే నిధులు ఖర్చు చేయడానికి ఓ అధికారి డాయింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. తన పరిధిలోని తొమ్మిది పీహెచ్‌సీలు, రెండు అర్బన్ ఆస్పత్రులను ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఇన్‌చార్జి డాక్టర్లు పనిచేస్తున్న పీహెచ్‌సీలకు మంజూ రయ్యే నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై రెండు ఆస్పత్రులకు మంజూరైన హెడీఎఫ్, ఎన్‌క్యూఏఎస్ నిధుల విషయంలో ఆ ఆస్పత్రుల డాక్టర్లు సదరు ఉపవైద్యాధికారిని నిలదీయడంతో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. ఆయన ఆరేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిధిలో ఉన్న తొమ్మిది పీహెచ్‌సీల్లో అడవిదేవులపల్లి, త్రిపురారం, ఆలగడప, దామరచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల రెగ్యులర్ వైద్యులు ఆస్పత్రులకు వచ్చే నిధులను డ్రాయింగ్ ఆఫీసర్ హోదాలో ఖర్చు చేస్తున్నా, పెద్దదేవులపల్లి, పాములపాడ్, వేములపల్లి, పెద్దవూర, హాలియా పీహెచ్‌సీలు, మిర్యాలగూడలోని ప్రకాష్‌నగర్, బంగారుగడ్డ అర్బన్ ఆస్పతులకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌వో వ్యవహరిస్తున్నారు. ఈ ఏడు ఆస్పత్రుల్లోనూ రెగ్యులర్ డాక్టర్లు ఉన్నా ఆయా పీహెచ్‌సీలకు మంజూరయ్యే నిధులు డ్రా చేసుకునే అవకాశం లేదు. ఈ ఆస్పత్రులకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న సదరు అధికారి తనకు నచ్చినరీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కొంత ముట్టజెబితేనే సంతకం**

పీహెచ్‌సీల్లో వైద్య సేవల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి పీహెచ్‌సీకి రూ.1.50లక్షల ఆస్పత్రి డెవలప్‌మెంట్‌ఫండ్(హెచ్‌డీఎఫ్), నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండెడ్(ఎన్‌క్యూఏఎస్) కింద సంవత్సరానికి రూ.3లక్షల నిధులు మంజూరవుతాయి. ఈ నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడం, నూతన పరికరాలు, ఫర్నిచర్ కొనగోలుకు ఖర్చుచేయాల్సి ఉంది. నిధులు డ్రాచేసే సందర్భంలో సదరు అధికారికి కమిషన్ రూపంలో కొంత ముట్టజెప్పితేకాని సంతకం పెట్టని పరిస్థితి ఉందని ఆరోపణలు ఉన్నాయి. ప్రతినెలా సమీక్ష సమావేశాలకు హాజరయ్యే ఆశ కార్యకర్తలకు మధ్యాహ్న భోజన సదుపాయంలోనూ నాసిరకం భోజనం పెడతారని సమాచారం. నూతన పరికరాలు, ఫర్నిచర్ కొనుగోలు విషయంలో పెద్దఎత్తున నిధుల స్వాహా జరిగినట్లు తెలుస్తోంది. తనిఖీ బృందాలు వచ్చిన సందర్భాల్లో పక్కనే ఉన్న ఆస్పత్రిలోని పరికరాలు, ఫర్నిచర్‌ను తనిఖీ చేసే ఆస్పత్రికి తరలించి అధికారుల మెప్పు పొందిన తర్వాత తెచ్చిన వస్తువులను అక్కడికి తరలిస్తారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బంగారుగడ్డ అర్బన్‌హెల్త్‌సెంటర్, హాలియా పీహెచ్‌సీ నూతన పరికరాల కొలుగోలు, మౌలిక సదుపాయల కొనుగోలు విషయంలో అందుబాటులో ఉన్న నిధులు ఖర్చుచేసేందుకు ఆయా ఆస్పత్రుల వైద్యులు సిద్ధమయ్యారు. ఈ విషయంలో డాయింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న సదరు అధికారి సహకరించకపోవడంపై ఆయా ఆస్పత్రులు మెడికల్ ఆఫీసర్లు నిలదీయడంతో సొంతశాఖలో చర్చనీయాంశంగా మారిందని సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ముందు మిర్యాలగూడ అర్బన్ ఏరియాలో ఓ ఆశా కార్యకర్త పోస్టు భర్తీ అయింది. జనాభా పెరగడంతో అదనంగా మంజూరైన పోస్టింగ్‌పై ఎలాంటి ప్రకటన బహిర్గతం చేయకుండానే నియామకం పూర్తిచేశారు. ఈ వ్యవహారంలో రూ.2లక్షల వరకు ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు ఆశా కార్యకర్త ప్రస్తుతం హౌసింగ్‌బోర్డులో పనిచేయాల్సి ఉండగా, బంగారుగడ్డ అర్బన్‌హెల్త్‌సెంటర్ నుంచి వేతనం పొందుతుండడం గమనార్హం.

**ఫైళ్లు చక్కబెడుతున్న షాడో!**

డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారికి ఓ ఉద్యోగి(సీహెచ్‌వో) షాడోగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆడిట్ దగ్గరపడుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీలకు మంజూరైన గ్రాంట్లను ఖర్చుచేసినట్లు ఫైళ్లు సైతం చక్కబెడుతున్నట్లు సమాచారం. నిధుల ఖర్చుల లెక్కలు చూపడంతో సిద్ధహస్తుడైన షాడో తనకున్న పరిచయాలతో నకిలీ బిల్లులు సృష్టించి రికార్డుల్లో నమోదుచేసి పెద్దసారు మెప్పుపొందినట్లు తెలుస్తోంది. కొద్దినెలల క్రితం జరిగిన బదిలీల్లో అతనికి స్థానచలనం జరిగి జిల్లా కార్యాలయానికి వెళ్లాడు. డిప్యూటీ ఆఫీసర్‌కు కుడి భుజంగా పనిచేస్తున్న ఆ ఉద్యోగి సేవలు కార్యాలయానికి దూరం కావడంతో అసౌకర్యానికిలోనై తిరిగి రప్పించుకునే ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడు. ప్రస్తుతం పెద్దసారు కార్యాలయానికి కూతవేటు దూరంలో పనిచేస్తున్న సదరు షాడో అధికారి మితిమీరిన పెత్తనం చెలాయిస్తున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. తనకున్న రెండు కార్లను సైతం సొంతశాఖకు అద్దెకిచ్చి ఓ కారులో తాను చక్కర్లు కొడడుతూ ఇన్‌చార్జి డాక్టర్లు పనిచేసే పీహెచ్‌సీలపై ఆజమాయిషీ చెలాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌సీలకు మంజూరయ్యే నిధుల వినియోగంలో వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమైనవని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి అన్నారు.

## గోపలాయిపల్లి గుట్టపై ధ్వజారోహణం


ధ్వజారోహణం చేస్తున్న యాజ్ఞీకులు

**నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23:** హరిహర క్షేత్రంగా భాసిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి గుట్టపై వెలిసిన వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం చేశారు. ఉదయం సుప్రభాత పూజతో క్రతువును ప్రారంభించిన యాజ్ఞీకులు చాత్మర, అంకురార్పణ, హోమాలను పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం పూర్తిచేశారు. అనంతరం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ అర్చకస్వాములు ధ్వజారోహణం చేశారు. అనంతరం గరుడ ముద్ద ఎగురవేశారు. సాయంత్రం భేరీపూజ, బలిహరణం గావించారు. ఈ వేడుకలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు, దోసపాటి విష్ణుమూర్తి, సరాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నేడు కల్యాణం:** ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన శనివారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. ఇప్పటికే కల్యాణ మంటపాన్ని విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే దంపతులకు ప్రత్యేక ప్రదేశాన్ని కేటాయించారు. సామాన్య భక్తులు కూడా కూర్చుని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు.

## 'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 23:** మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.కరుణాకర్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని నర్సరీలను, ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రజలు పాల్గొనేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని, ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో మోసిన్‌అలీ, టీఏ రాధ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**దేవరకొండ, ఫిబ్రవరి 23:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, మాజీ అధ్యక్షుడు నెమికంటి గౌరిశంకర్ అన్నారు. దేవరకొండ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దివంగత నెమికంటి సోమన్న వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. నెమికంటి సోమన్న న్యాయవాదిగా, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సన్నిహితుడిగా ఉంటూ దేవరకొండ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేబాక, సీనియర్ న్యాయవాది ఆంజనేయులు, నాయకులు రమశంకర్, గణేష్, లలిత, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర చట్టం చేయాలి


రాస్తారోకో చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

**దేవరకొండ, ఫిబ్రవరి 23:** రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన చేస్తున్న రైతులపై దాడిని నిరసిస్తూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడుతూ మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు నిర్వహించడంతో శుభకరణ్‌సింగ్ అనే రైతు మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కుటుంబానికి కోటి రూపాయలు ప్రకటించాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు బిజిలి లింగయ్య, రహీం, శ్రీను, వెంకటేష్, అంజి, కాశయ్య, యేసోబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుమలనాథస్వామి జాతర

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


రాష్ట్రస్థాయి ఎడ్ల పందెం పోటీలకు సిద్ధమైన మైదానం

**తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 23:** మండలంలోని తూటిపేటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కోనేటిపురం శివారులో గుట్టపై వెలసిన పద్మావతి సమేత తిరుమలనాథ స్వామి జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి రాయప్రోలు మురళీశర్మ మాట్లాడుతూ ఉదయం 7గంటలకు స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించి 11.59 గంటలకు కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బుర్రి రాంరెడ్డి పేర్కొన్నారు. జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని కుంకుడుచెట్టుతండా గ్రామస్థులు సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుట్టపైన, కింద భక్తుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించామన్నారు. జాతర సందర్భంగా మహిళ కోలాటాలు, చిన్నారులకు నృత్య పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


అగ్నిగుండం గుండా నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 23:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు సల్వాది ధనిష్ఠసుశీల దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడుచుకుంటూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు బోనాలతో ఊరేగింపుగా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించుకున్నారు.

## పబ్లిక్ ఎజెండా
public agenda

**సౌకర్యాలు కల్పించాలి: కొండమల్లేపల్లి:** మండలం కేంద్రంలోని పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. వాహన టైర్లలో ఉచితంగా గాలి నింపడం, తాగునీరు, స్త్రీలు, పురుషులకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాల్సి ఉండగా 7 పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు లేవన్నారు.

**పశువైద్యశాలకు బోర్డు ఏర్పాటు చేయాలి : కొండమల్లేపల్లి:** మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న పశువైద్యశాలకు ఎలాంటి బోర్డు లేకపోవడంతో పశువైద్యశాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. బీసీ కాలనీలోని ఇళ్ల మధ్య పశువైద్యశాల ఉండటంతో బోర్డు లేకపోవడం వల్ల కార్యాలయం ఎక్కడ ఉందోనని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**108 సేవలు కల్పించాలి: డిండి:** మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారి 765పై ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్యసేవలు అందక క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యవసర సమయాల్లో 108 సౌకర్యం లేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా 108 సౌకర్యం కల్పించాలని డిండి మండల ప్రజలు కోరుతున్నారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- ▸ కేసులు నమోదు చేస్తున్నా ఖాతరు చేయని ఇసుక మాఫియా
- ▸ అమ్మనబోలు మూసీ నుంచి తరలింపు
- ▸ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు నిర్ణయం



అమ్మనబోలు వాగులో ఇసుక లోడ్ చేసుకున్న ట్రాక్టర్లు, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న గ్రామస్థులు

**నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23:** నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు-పొడిచేడు శివారులో ఉన్న మూసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో కొన్ని నెలల పాటు ఇసుక తరలింపును ఆపేసిన ఇసుకాసురులు మళ్లీ ఆ దందాను కొనసాగిస్తున్నా ఆపేవారే లేరని గ్రామస్థులు వాపోతున్నారు. ఆ ప్రభుత్వం ఉన్నప్పుడు వాళ్లు... ఈ ప్రభుత్వం ఉన్నప్పుడు వీళ్లంటూ ప్రజల్లో విమర్శలు వినవస్తున్నాయి.

### అనుమతి పేరిట అక్రమ రవాణా?

ప్రభుత్వ పరంగా మంజూరైన అభివృద్ధి పనుల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఓ చోటికి తరలించి డంప్‌లను రాత్రికి రాత్రే హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు ఈ దందాను అడ్డుకోవాలని ప్రయత్నించినా ఎదురుదాడికి దిగిన సంఘటనలు ఉన్నాయి.

### గ్రామాభివృద్ధికి ఇసుక రాయల్టీ?:

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎంత ప్రయత్నించినా అధికార పార్టీ నేతల రాజకీయ జోక్యంతో సాధ్యం కాని పరిస్థితుల్లో ఇసుక తరలింపు రాయల్టీని వసూలు చేయాలని గతంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. గ్రామంలో ముఖ్యమైన నాయకులతో చర్చించి ట్రాక్టర్‌కు కొంత చొప్పున ఫీజు వసూలు చేసి గ్రామాభివృద్ధికి వాడుకోవాలని సంకల్పించి అమలు చేసిన ప్రయత్నం అభిప్రాయభేదాలతో బెడిసికొట్టింది.

### మున్నాళ్ల ముచ్చటగా పికెటింగ్

అమ్మనబోలు మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైనంపై పోలీసులపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కొన్నాళ్ల పాటు అమ్మనబోలు మూసీ బ్రిడ్జిపై పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఫలితంగా ఇసుక తరలింపు ఆగిపోవడంతో పోలీస్ పికెట్‌ను ఎత్తివేశారు. దీంతో మళ్లీ ఇసుక తరలింపు షురూ చేశారు.

### అధికారులు చర్యలు తీసుకోవాలి



అమ్మనబోలు మూసీ వాగు నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక సంపదను, బ్రిడ్జి భద్రతను సంరక్షించాలి. ఆ దిశగా సంబంధిత అధికార యంత్రాంగం స్పందించాలి. ప్రభుత్వ పనులకు మాత్రమే, అనుమతి ఉంటేనే ఇసుక తరలింపు జరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. వ్యాపారపరంగా కాకుండా గ్రామ అవసరాలకు మాత్రం మినహాయింపు ఇవ్వాలి.

- బొడిగె భరత్‌గౌడ్, అమ్మనబోలు

### బైండోవర్ చేస్తాం



అమ్మనబోలు మూసీ వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. త్వరలోనే గ్రామంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఇసుక తరలించే వారిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తాం. అయినా అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం.

- ఎన్. అంతిరెడ్డి, ఎస్ఐ, నార్కట్‌పల్లి

# 100 రోజుల పనిదినాలు కల్పించాలి

● జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారి నాగిరెడ్డి


బట్లపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ నాగిరెడ్డి

**మర్రిగూడ, ఫిబ్రవరి 23:** ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులకు ప్రతీ ఒక్కరికి 100 రోజులు పని రోజులు కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారి నాగిరెడ్డి అన్నారు. మండలంలోని బట్లపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. బట్లపల్లి సమీపంలో ఉన్నటువంటి గుట్ట చుట్టూ కందకాలను తవ్వుతున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు కూలీ ఎంత వస్తుందని, ఎంత డబ్బులు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి 100రోజులు పని కల్పించి రూ.275లు కూలీ వచ్చే విధంగా కూలీలతో పనులు చేయించాలని సూచించారు. జిల్లాలో 884 గ్రామపంచాయతీల్లో రోజు 100మంది చొప్పున కూలీలు ఉపాధి హామీ పథకాన్ని వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో 300శాతం పనులను గుర్తించి పనులను మంజూరు చేసుకుని సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామపంచాయతీ నుంచి కూలీలకు మంచి నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కూలీకి ఆధార్ అనుసంధానం చేసి ఆధార్ బేస్ పేమెంట్ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన పీడీ నాగిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నవీన్, ఎంపీడీవో మున్నయ్య, ఏపీవో వెంకటేశం, అక్షిత, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షమయ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

### వైభవంగా కొనసాగుతున్న
## ఉర్సు ఉత్సవాలు

**చింతపల్లి, ఫిబ్రవరి 23:** మండలంలోని పీకే మల్లేపల్లి గ్రామంలో హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దర్గా వద్ద దీపారాధనలు, కందుర్లు, మొక్కుబడులను భక్తులు చెల్లించుకున్నారు. దర్గా వద్ద ఉన్న శ్రీ మక్కా మహేశ్వర దేవాలయంలో కూడా అభిషేకాలు తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కె.పుష్పలీల దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో పుష్పలీలను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు, నెల్లూరు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. దర్గాముత్తవెల్లి చాంద్‌పాష భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్గాకమిటి చైర్మన్ రమేష్‌రాజ్, వైస్ చైర్మన్ జానిమియా, సయ్యద్‌పాష, యూసుఫ్ పాష, కలీల్ పాష, కృష్ణ, అబ్బయ్య, వలీ, సులేమాన్ పాల్గొన్నారు.

# సంత్‌గాడ్గే సేవలు చిరస్మరణీయం


నల్లగొండలో సంత్‌గాడ్గేకు నివాళులర్పిస్తున్న రమేష్‌గౌడ్

**నల్లగొండ టౌన్, దేవరకొండ, ఫిబ్రవరి 23:** సంఘసంస్కర్త స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్‌గాడ్గే బాబా సేవలు చిరస్మరణీయమని మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆమంచ అంజయ్య అన్నారు. సంతు గాడ్గేబాబా జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టిన శ్రీశ్రీ సంతు గాడ్గేబాబా గోరక్ష కేంద్రాలు, ఆసుపత్రులు, పాఠశాలలు నిర్మించి ఆదర్శంగా నిలిచాడని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వీధులను శుభ్రపరిచి చైతన్యపరిచారని పేర్కొన్నారు. సంత్‌గాడ్గే సేవలను కొనియాడారు. ఆయన జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

● తెలంగాణ రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో గడియారం సెంటర్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర వైస్ చైర్మన్ చిలకరాజు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు సతీష్‌కుమార్ మాట్లాడుతూ సంత్‌గాడ్గే సేవలను కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు భీమనపల్లి శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రజక భవన కమిటీ అధ్యక్షుడు ఆమంచి అంజయ్య, నాయకులు చిక్కుల రాములు, దూదిగామ సత్తయ్య, ఎల్లుట్ల సైదులు, పగిళ్ల వెంకన్న, సత్తయ్య, అంజయ్య, శంకర్, ఈదయ్య, యాదయ్య, మల్లేష్, యాదగిరి పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం ఎదుట రజకసంఘం ఆధ్వర్యంలో గాడ్గేబాబా జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రజకసంఘం జిల్లా అధ్యక్షుడు ఆమంచ అంజయ్య, నాయకులు రేవెల్లి వెంకటయ్య, రాజుపేట శ్రీను, బూషరాజు వెంకన్న, శ్రీను, శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్యశిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

**చండూరు రూరల్, ఫిబ్రవరి 23:** వైద్య శిబిరాలను సద్వి నియోగం చేసుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన మల్లయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు చెందిన యశోద ఆసుపత్రి మలకపేట వైద్యులతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో గుండె, కళ్లు, గైనిక్, జనరల్, దంత, ఎముకల ప్రత్యేక వైద్యసిబ్బంది పాల్గొని పరీక్షలు, వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు, సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ రాజు, ఎస్ఐ సురేష్, ఆర్ఐ మధు, ఇన్‌చార్జి ఎంపీవో షఫీ, మునిసిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కుటుంబసభ్యులు బొమ్మరబోయిన సైదులు, ప్రేమలత, బొమ్మరబోయిన నాగార్జున, రమేష్ శ్రీనిక, రాజు, దీపిక, జాహ్నవి, వేదశ్రీ, లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, పద్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులను నిర్మూలించాలి

**చండూరురూరల్, ఫిబ్రవరి 23:** మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలో బెల్టుషాపుల నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. చండూరు మండలం శిర్దేపల్లి, కస్తాల గ్రామాలలో శుక్రవారం ఎంపీటీసీ నాతాల వనజ విష్ణువర్ధన్‌రెడ్డి, పోలు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 10 మంది మహిళలు, 10 మంది పురుషులతో కూడిన బెల్టుషాపుల నిర్మూలన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ వల్ల కలిగే నష్టాలు, మద్యం తాగడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొరిమి ఓంకారం, మాజీ సర్పంచులు అబ్బనబోయిన లింగయ్య, సాపిడి రాములు, సైదులు, నాయకులు రాజు, కట్ట భిక్షం, మల్లేష్, రామకృష్ణ, లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీజమదగ్ని రేణుకాఎల్లమ్మ కల్యాణం

**కనగల్, ఫిబ్రవరి 23:** మండలంలోని పగిడిమర్రి గ్రామంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గోవిదాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి, రేణుకాఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీజమదగ్ని రేణుకాఎల్లమ్మ అమ్మవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మేళతాళాలు సన్నాయి వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ సాగిన కల్యాణతంతుకు గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఒడిబియ్యం, కట్నకానులను సమర్పించి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచులు గోలినర్సిరెడ్డి, జగాల్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా తలంబ్రాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. గ్రామ ఎంపీటీసీ ఎర్రమాద యశోదమ్మ, గ్రామ పెద్దలు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన శ్రీ సీతారామచంద్రస్వామివారి కల్యాణం, 25న శ్రీగోవిందాంబ వీరబ్రంహ్మేంద్రస్వామి వారి కల్యాణం 26న ఉదయం అగ్నిగుండాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### పార్లమెంట్ ఎన్నికల్లో
## బీజేపీ గెలవడం ఖాయం : మన్మథరెడ్డి

**రామగిరి, ఫిబ్రవరి 23:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తుక్కాని మన్మథ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయుష్మాన్ భారత్, సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ వంటి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈసారి కూడా ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా 500 సంవత్సరాల హిందువుల కల అయిన అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టిన కారణజన్ముడు నరేంద్రమోదీ అని అన్నారు. అధిష్ఠానం టికెట్ ఇస్తే ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక మెజారిటీతో గెలుస్తానన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బూర మల్సూర్‌గౌడ్, మీడియా కన్వీనర్ పాలకూరి రవి, నాయకులు ఫణినాయుడు, రాపర్తి హరిప్రసాద్, పెనుగొండ రవివర్మ, సందీప్‌గౌడ్, చిలువేరు మనోహర్, జెల్లి గణేష్, నరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి
## మంత్రి పదవి కోసం హోమం

**మునుగోడురూరల్, ఫిబ్రవరి 23:** మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తూ డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో శుక్రవారం రామాలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం పార్లమెంటులో కొట్లాడారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయనకు మంత్రి పదవి ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని, అందులో భాగంగానే నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా బెల్ట్‌షాపులు ఉండవద్దని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాయకులు, గ్రామస్థులు హోమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల మల్లయ్య, తాటికొండ సైదులు, పాలకూరి యాదయ్య, జాల వెంకన్న, పోలగోని ప్రకాష్, అనంత లింగస్వామి, అనంతసాయి, యారుకొండ శ్రీరాములు, జీడిమడ్ల ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం...

**నాగార్జునసాగర్:** నల్లగొండ జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టును రేపు (ఆదివారం) ఉదయం 10 గంటలకు హాలియా మునిసిపాలిటీ ఇబ్రహీంపేట గ్రామంలో ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అ ధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, జి.కర్తయ్య శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

**హాలియా:** విద్యారంగంలో 30 సంవత్సరాలు విశేష సేవలందించిన హాలియాలోని అక్షయ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రముఖ విద్యావేత్త షేక్ వహీద్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన విద్యారంగ జీవితంలో ఎంతోమంది విద్యార్థులను పలు ప్రభుత్వ సంస్థ ఉద్యోగులుగా, జీవితంలో స్థిరపడే విధంగా తీర్చిదిద్దారు. తెలంగాణ ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఏకైక ప్రైవేట్ టీచర్ వహీద్ కావడం విశేషం.

**మిర్యాలగూడ:** సావిత్రీబాయి, పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కోటపెల్లి మండలం బోరెంపల్లి గ్రామంలో విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.

**మునుగోడురూరల్:** మండలంలోని పలివెల జడ్పీ హైస్కూల్‌లో సింక్ క్రోని ఫైనాన్స్ అండ్ అసిస్టు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న పరిసర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినీ, విద్యార్థులకు సంస్థ ద్వారా 120 సైకిళ్ల పంపిణీ చేశారు. అంతేకాకుండా పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌కు సంబంధించిన కంప్యూటర్లు, లైబ్రరీకి సంబంధించిన పుస్తకాలు, వృత్తి విద్యా కోర్సుల్లో కుట్లు, అల్లికలు నేర్చుకోవడానికి కుట్టుమిషన్లు, ప్రయోగశాలకు సంబంధించిన పరికరాలు మొదలైనవి అందించారు.

**మిర్యాలగూడ టౌన్:** బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన ఎడ్ల రమేష్ నియమితులయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న రమేష్ పీఎం విశ్వకర్మ యోజన స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర రథసారధి కిషన్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ నియామకంపై బీజేపీ, అనుబంధ సంఘాలు, మోర్చాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

**మర్రిగూడ:** మద్దతు ధర చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు దాడులు చేయడం అప్రజాస్వామికం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మృతి చెందిన రైతు హర్యానా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతు హత్యను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు.

**దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని గాంధీబజార్‌కు చెందిన జొర్రిగల యాదగిరి కూలీ పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. యాదగిరికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె వివాహం చేయగా గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. వారం రోజుల క్రితం యాదగిరి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో యాదగిరి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న యాదగిరి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. శుక్రవారం దేవరకొండలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న మిత్రులు యాదగిరిని కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. యాదగిరి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

**హాలియా:** కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి మాతృమూర్తి రాములమ్మ అకాలమరణం చెందడంతో శుక్రవారం సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుందూరు వెంకట్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.

**తిరుమలగిరి(సాగర్):** మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాపోలు పరమేష్ ప్రతిభ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, పావని, బాలకృష్ణ, విజయలక్ష్మి, లింగమ్మ, వీరయ్య పాల్గొన్నారు.

### వైద్య చికిత్సపై చేసిన ఆరోపణలు అవాస్తవం

**మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 23:** గుండె నాళాలకు చేసిన స్టంట్స్ చికిత్సపై రోగి ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణలు అవాస్తవమని రివర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగికి యాంజియోగ్రామ్ చేసి స్టంట్లు వేసిన వివరాలను వీడియోగ్రఫీ ద్వారా వివరించారు. ప్రవీణ్‌కుమార్ గుండెలోని ఎల్ఏడీ నాళం పూర్తిగా దెబ్బతిన్నదని, దానికి స్టంట్ వేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మిగతా రెండు నాళాలకు నాలుగు స్టంట్స్ వేసి వేసినట్లు తెలిపారు.

### 'స్కూల్ ఫీజు కోసం ఇబ్బందులు పెట్టొద్దు'

**మునుగోడు, ఫిబ్రవరి 23:** మండల కేంద్రంలోని ఓ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం స్కూల్ ఫీజుల కోసం విద్యార్థులను నిర్బంధించినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. రోజూ మాదిరిగానే పాఠశాలకు వెళ్లిన పిల్లలు రాకపోవడంతో తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లారు. పాఠశాలలోని ఓ తరగతి గదిలో వారిని నిర్బంధించడంతో మా పిల్లలను ఇలా ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. ఆ స్కూల్ కరస్పాండెంట్ మాట్లాడుతూ ఫీజులు చెల్లించకుండా ఎదురు మాట్లాడుతున్నారని దురుసుగా ప్రవర్తించడంతో పాటు చేయిచేసుకున్నాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌తో పాటు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఎంఈవో నర్సింహను వివరణ కోరగా.. తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**శాలిగౌరారం, ఫిబ్రవరి 23:** శాలిగౌరారంలోని ఎస్సీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్ దగ్ధమైన ఫ్లెక్సీని పరిశీలించారు. అనంతరం ఎస్ఐ ఐలయ్యకు ఫిర్యాదు చేయగా వెంటనే ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.